ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 14 జనవరి 2024



పండుగ సందడి

నేడు భోగి..

రేపు సంక్రాంతి..

16న కనుమ





పండుగ సందడి మొదలైంది. ఆదివారం భోగి, సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. పండ్లు, పూలు, సరుకుల కొనుగోలు కోసం వచ్చినవారితో మార్కెట్లు రద్దీగా కనిపిస్తున్నాయి. ఉద్యోగం, ఉపాధి కోసం వలస వెళ్లినవారు ఇప్పటికే సొంతూళ్లకు చేరుకున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు.. దూరమైనా.. ముంగిట ముత్యాల ముగ్గులు మాత్రం కనువిందు చేస్తున్నాయి. భోగి రోజున గొబ్బెమ్మల కోసం నగరాలు, పట్టణాల్లో పేడను కొని తెచ్చుకుంటున్నారు. పండుగకు ఒకప్పుడు బంధువులు వచ్చేవారు. ఇప్పుడు వలస ప్రాంతాల నుంచి ఎవరి ఇళ్లకు వారు వచ్చేస్తున్నారు. విద్యాసంస్థలు, ఉద్యోగాలు ఇచ్చిన సంస్థలు కొన్ని రోజులు సెలవు ఇవ్వడంతో వలస పక్షులు రివ్వున ఎగిరి గూటికి చేరుకున్నాయి. పుట్టి పెరిగిన ఊరిలో.. తల్లిదండ్రులు, తోబుట్టువులు, ఊరి జనంతో కలిసి గడిపే ఈ మూడు రోజులు మధురాతి మధురంగా ఉంటాయి.

ఆనందంగా గడపండి: కలెక్టర్

అనంతపురం టౌన్: భోగభాగ్యాలు కల్పించే సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కలెక్టరు గౌతమి కోరారు. జిల్లా ప్రజలకు ఆమె సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్రమైన భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని అన్నారు.

- అనంతపురం కల్చరల్



పాతూరులో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

షోకాజ్ నోటీసులకు భయపడం

- పండుగ తరువాత రాష్ట్ర బంద్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



← దీక్షా శిబిరంలో కూర్చొని నినాదాలు చేస్తున్న రామకృష్ణ

అనంతపురం విద్య, జనవరి 13: అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇస్తే భయపడేది లేదని, ప్రభుత్వం దిగి వచ్చే వరకూ పోరాటాన్ని ఆపేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. కలెక్టరేట్ వద్ద శనివారం షోకాజ్ నోటీసులను భోగి మంటల్లోపై వేసి దహనం చేశారు. జిల్లా వ్యాప్తంగా 33వ రోజు సమ్మె కొనసాగించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, మైనార్టీ నాయకులు ఏఎం బాషా, ఎస్టీ సెల్ నాయకుడు రామాంజినేయులు, టీడీపీ నాయకుడు దేవళ్ల మురళి తదితరులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అంగన్‌వాడీలది కనీవిని ఎరుగని పోరాటమని అన్నారు. ఏకంగా 33 రోజులు ఇళ్లు, పిల్లలు, కుటుంబాలను వదలి రోడ్డుపై పోరాటం చేయడం ఊహించనిదని అన్నారు. సీఎం జగన్ ఒక గంట సమయం కేటాయిస్తే 1.06 లక్షల మంది అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కానీ ఆయనకు సమయం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ గతంలో వై నాట్ 175 అన్నారని, ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం అని, ఇది దుర్మార్గమని అన్నారు. జగన్ తప్పు చేస్తున్నారని, ఆడబిడ్డలు శాపం పెడితే ఇంటి బాట పట్టాల్సిందేనని హెచ్చరించారు. ఎస్మా ప్రయోగం తగదని, వెనక్కు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ ముగిసేలోగా సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే అన్ని పార్టీలతో కలసి రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటల్లో షోకాజ్ నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

బహుదూరపు కేంద్రాలు

19 నుంచి ఎస్కేయూ పీజీ పరీక్షలు



అనంతపురం సెంట్రల్, జనవరి 13: ఎస్కేయూ పరిధిలో పీజీ పరీక్ష కేంద్రాల ఏర్పాటు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఈ నెల 19 నుంచి జరిగే పరీక్షలకు అనంతపురం, హిందూపురం, గుంతకల్లు, కదిరి పట్టణాల్లో మాత్రమే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం ప్రాంత విద్యార్థులకు ఎస్కేయూ క్యాంపస్‌లో, అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా విద్యార్థులకు హిందూపురం, కదిరిలో మాత్రమే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లకు దూరంగా ఉన్న వారు వంద కి.మీ. పైగా ప్రయాణించి పరీక్షలు రాయాల్సి వస్తుంది. ఇది ఖర్చుతో కూడుకున్నదని, అంత దూరం ప్రయాణించడం ఇబ్బందికరమని విద్యార్థులు అంటున్నారు. వర్సిటీ అధికారుల తీరుకారణంగా తాము నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. రామకృష్ణారెడ్డి వీసీగా ఉన్న సమయంలో పలు పరీక్ష కేంద్రాలను రద్దు చేశారని, గతంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలనే ఇప్పుడు కొనసాగిస్తున్నామని ఎస్కేయూ పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ అన్నారు. ఏవైనా సమస్యలుంటే విద్యార్థులు తమకు ఫిర్యాదు చేయవచ్చని అంటున్నారు. వర్సిటీ అధికారుల తీరును విద్యార్థి సంఘాలు ఎండగడుతున్నాయి. దూర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయిస్వామి అన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



• అప్పుడే జలపోరాటం

కుందుర్పిలో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

సాధారణంగా తాగునీటి సమస్య వేసవిలో తలెత్తుతుంది. కానీ ప్రభుత్వ తీరు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేసవికి రెండు నెలల ముందే జనం నీటికోసం రోడ్డెక్కుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని గాంధీ నగర్ కాలనీవాసులు, కుందుర్పి మండల కేంద్రంలో మహిళలు శనివారం ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. గాంధీనగర్ కాలనీకి 20 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె కారణంగా కుందుర్పి మండల వ్యాప్తంగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతాల ప్రజలు ఆందోళనకు దిగారు.

- రాయదుర్గం/కుందుర్పి



మొలకాల్పూరు రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు



ఆర్ కొట్టాల -డొనేకల్లు దారి దుస్థితి

ఇదేం దారిద్ర్యం..?

ఉన్న రోడ్డును తవ్వి.. వదిలేసిన అధికారులు - రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న జనం

విడపనకల్లు మండలంలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపేశారు. తారు రోడ్లు వేసేందుకు ఉన్న రోడ్లను తవ్వి వదిలేశారు. కరకముక్కల-పాల్తూరు రోడ్డును దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర మూడేళ్ల క్రితం తవ్వి, కంకరవేసి వదిలేశారు. ఈ రోడ్డు పనులను చేయాలని అధికార పార్టీ నాయకులే రోడ్డుపైకి చేరి నిరసన తెలిపారు. తారు రోడ్డు వేయకున్నా పర్వాలేదు, కనీసం మట్టి రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి అని అధికారులను వేడుకున్నారు. కానీ నిధులు లేకపోవటంతో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈ దారిలో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఆర్.కొట్టాల-డొనేకల్లు మధ్య తారు రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఆరు నెలల క్రితం ఉన్న మట్టి రోడ్డును యంత్రాలతో తవ్వి, కంకర పరిచి వదిలేశారు. మూడు కిలో మీటర్ల మేర కంకర వేయడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారిలో ఎక్కువగా రైతులు పొలాలకు వెళ్లి వస్తుంటారు. పంట కాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఉన్న కంకరను తొలగించాలని తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ స్పందన లేదు. నిధుల కొరతతో పనులను ఆపేశామని కాంట్రాక్టరు అంటున్నారు.

- విడపనకల్లు



కరకముక్కల-పాల్తూరు దారి దుస్థితి

ఊరు దాటని బావ మరిది..!

భూ వివాదాలే అతడి ఆదాయ వనరు





బదిలీ అయినా.. ప్రమోషన్ వచ్చినా.. అక్కడే..!

రాయదుర్గం, జనవరి 13: బదిలీ అయితే ఎవరైనా వేరే ఊరికి వెళతారు. కానీ రెవెన్యూ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగికి మాత్రం బదిలీ అయినా, ఉద్యోగోన్నతి లభించినా ఆ ఊరు, ఆ కార్యాలయం దాటరు. కొన్నేళ్ల నుంచి ఆయన అక్కడే పనిచేస్తూ.. తన పనులను చక్కబెట్టుకుంటున్నాడు. వివాదాస్పద భూములను తక్కువ రేటుకు కొనడం, రికార్డులను మార్చడం తదితర కార్యకలాపాల ద్వారా రూ.కోట్లకు పడగలెత్తారని ప్రచారం ఉంది. కణేకల్లు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను ఎవరూ కదిలించలేరు.. ప్రశ్నించలేరు. ఒకవేళ ఎవరైనా టచ్ చేయాలని చూస్తే.. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుంటారు. 'మా బావ..' అని బెదిరిస్తారు. అయినా వినకుండా ఎవరైనా టచ్ చేస్తే.. వెంటనే బావ నుంచి ఫోన్‌కాల్ వస్తుంది. దీంతో ఎందుకొచ్చిన గొడవ అని తహసీల్దారు మొదలు వీఆర్వో వరకూ మిన్నకుండి పోతారని సమాచారం. ఇలా బావ అండ చూసుకుని, వివాదాస్పద భూములు, ఆన్‌లైన్ సమస్యలున్న భూముల విషయంలో బేరాలకు దిగుతున్నాడు. 'సమస్య తీవ్రస్థాయిలో ఉంది. మీ జీవిత కాలం కష్టపడినా ఆ భూమి రికార్డులను సరిచేయడం ఎవరి వల్లా కాదు..' అని బెదరగొడతారు. ఆ తరువాత తక్కువ ధరకు కొనేసి సొమ్ము చేసుకుంటాడు. ఇలా గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో కణేకల్లు ప్రాంతంలోని పలు భూములు, స్థలాల వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ సంపాదనకు తెరలేపారు. అధికార పార్టీ నాయకులు కొందరు అతని కనుసన్నల్లో దందాలు చేసుకుంటూ దర్జాగా సంపాదిస్తున్నారని సమాచారం.

కన్ను పడితే.. కొనేదాకా వదలరు

రెవెన్యూ రికార్డులన్నీ తన ఇంట్లోనే..

ఎవరైనా టచ్ చేస్తే.. బావ బెదిరిస్తాడు..!

- భూముల రికార్డుల పరంగా సమస్యలున్నవారు తహసీల్దారు కార్యాలయానికి వస్తే.. ఆ సమస్య తీవ్రతను పెంచి, బాధితున్ని వేధించి.. ఆ భూమిని కాజేసేదాకా అతను నిద్రపోడట. కణేకల్లులో ఓ వ్యక్తి తాతల కాలం నుంచి అనుభవంలో ఉన్న భూమి విషయమై అధికారులను సంప్రదించాడు. రికార్డుల పరంగా వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉందని, తమ పేరిట మార్చాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసి అలసిపోయారు. విషయం తెలుసుకున్న ఆయన వెంటనే రంగంలోకి దిగారు. రికార్డులను మార్చడానికి చాలా కష్టాలు పడాల్సి ఉంటుందని, తనకు అమ్మేస్తే సరిచేసుకుంటానని బేరం పెట్టాడు. మార్కెట్ విలువ కంటే తక్కువకు కొనుగోలు చేసి, పైరవీల ద్వారా రికార్డులను మార్చేసుకున్నట్లు తెలిసింది.
- ఉరవకొండ రోడ్డులో లే అవుట్ వేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి 'దారి లేదు..' అని అమ్మకాలను నిలిపివేయించాడు. దీంతో రస్తా కోసం ఆ వ్యాపారి భూమిని కొనుగోలు చేశాడు. అయినా తనకు ముడుపులు ఇవ్వనందుకు 'బావ' పేరు చెప్పి అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. దీంతో రూ.7 లక్షల దాకా ముడుపులు చెల్లించి, ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి పని చక్కబెట్టుకున్నడని సమాచారం.
- కణేకల్లు బస్టాండ్ సమీపంలో పాత ఇంటిని ఇద్దరు అన్నదమ్ములు పడగొట్టి.. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ పనులను అడ్డుకుని, వారి నుంచి రూ.10 లక్షల దాకా వసూలు చేశాడని సమాచారం.
- తన అధీనంలో ఉన్న 60 సెంట్ల స్థలానికి పాస్ పుస్తకం కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఓ వ్యక్తి తిరిగాడు. విషయం తెలుసుకున్న ఆయన.. 'ఆ స్థలం నీది కాదు..' అని బెదిరించి, తనకు అమ్మాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఇలాంటివి ఎన్నెన్నో ఉన్నా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో కాకుండా, ఆయన ఇంట్లో ఉంటాయని సమాచారం. డైక్లాట్ కావాలన్నా, అడంగల్ చూడాలన్నా అతని ఇంటి వద్దకు వెళ్లి అంతో ఇంతో ఇవ్వాల్సిందేనని బాధితులు అంటున్నారు.

కన్ను పడితే అమ్మాల్సిందే..



ఆయనతో పెట్టుకుంటే అంతే..

కణేకల్లు తహసీల్దారు కార్యాలయంలో ఆయనతో పెట్టుకున్నవారు ఎవరూ ప్రశాంతంగా ఉన్న దాఖలాలు లేవు. తనకు నచ్చకపోయినా, తనతో పెట్టుకున్నా 'బావ'కు చెప్పి బదిలీ చేయించేవారట. నాలుగున్నరేళ్ల కాలంలో ఆయన ఆగ్రహానికి గురై, బదిలీపై వెళ్లిన వారి సంఖ్య చాలా ఉందని సమాచారం. రెవెన్యూ అధికారులు కూడా అతని వ్యవహారం గురించి పట్టించుకోరట. అతనితో సన్నిహితంగా ఉంటే పనులు జరుగుతాయని అధికార పార్టీవారు చేరువయ్యేందుకు పోటీ పడతారట. భూ సమస్యలు, వివాదాలను ఆయన ద్వారా పరిష్కారం చేయించుకుని, వసూళ్లు చేసుకునేవారి సంఖ్య తక్కువేమీ లేదని అంటున్నారు. ఇన్నాళ్లూ బావ పేరు చెప్పి దందా నడిపాడు బావమరిది. ఇప్పుడు అధికార పార్టీకి బావ దూరంగా జరిగాడు. దీంతో బావమరిది పరిస్థితి ఏమిటా అన్న చర్చ జరుగుతోంది.



పారదర్శకంగా పనిచేయండి

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ సుధాకర్

అనంతపురం సెంట్రల్, జనవరి 13: పారదర్శకంగా పనిచేయాలని ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుధాకర్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన పరీక్షల నిర్వహణ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకన ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రథమ, తృతీయ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని, ఇందులోభాగంగా పూర్తయిన పరీక్షల మూల్యాంకనం జరుగుతోందన్నారు. త్వరితగతిన ఫలితాలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, సూపరింటెండెంట్ మారుతీ, ఉద్యోగులు సాయికుమార్, పెద్దన్న, ఫణిక్రిష్ణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గోదా రంగనాథ పూజలు

అనంతపురం కల్చరల్, జనవరి 13: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శనివారం సాయంత్రం శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో గోదా రంగనాథస్వామి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గోదాదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక విష్ణుసహస్రనామ, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పఠనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకబృందం, భక్తులు పాల్గొన్నారు.

ప్రభాకర్ చౌదరితోనే అనంత అభివృద్ధి

టీడీపీ రజక సాధికార కమిటీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ రజక సాధికార సమితి నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 13: మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరితోనే అనంత అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రజక సాధికార సమితి నాయకులు రమేష్‌బాబు, వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. అనంతపురం అర్బన్‌లో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో చేసిందేమీ లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో సమష్టిగా ప్రభాకర్ చౌదరిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, శీనా, వెంకటరాముడు, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సాయి మహేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కలిమిశెట్టి మునిరత్నం ఆధ్వర్యంలో శనివారం వేణుగోపాల్‌నగర్‌లో దాదాపు 2 వేల మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథమందిర కమిటీ సభ్యుడు జీవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్‌ఐ నగేష్, నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ అనంతమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సాయి మహేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిఏటా కులమతాలకు అతీతంగా అన్ని సామాజికవర్గాలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం దాదాపు 2వేల మంది పేద మహిళలకు చీరలు వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతికి శాస్త్రీయ ఆలోచనలు అవసరం

- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి



ప్రజాసైన్స్ సీడీలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 13: సమాజ ప్రగతికి శాస్త్రీయ ఆలోచనల ఆవశ్యకత ఎంతైనా ఉందని జనవిజ్ఞానవేదిక(జేవీవీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో 'ప్రజా సైన్స్ గీతాలు' సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న వెనుకబాటుతనాన్ని తొలగించి, ప్రగతి కోసం శాస్త్రీయంగా ఆలోచించే విషయంలో జేవీవీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రజాసైన్స్ ఉద్యమం పేరుతో జేవీవీ 40 ఏళ్లుగా కృషిచేస్తోందని, ఇందులో డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు భాగస్వాములుగా ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రజాకవుల చేత రాయించి, గాయకులచేత పాడించిన పాటలు ప్రజాసైన్స్ ఉద్యమానికి మరింతగా తోడ్పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జేవీవీ జిల్లా కమిటీ నాయకులు జిలాన్, భాషా, గాంగేనాయక్, నగర కమిటీ నాయకులు రామిరెడ్డి, వీర్రాజు, సాకే లక్ష్మినారాయణ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

అనంతపురం కల్చరల్, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీనివాసనగర్‌లోని రిలయన్స్ మార్ట్‌లో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీ ఉత్సాహంగా సాగింది. దాదాపు 50 మంది పోటీల్లో పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు జ్ఞాపికలు బహుకరించడంతోపాటు పోటీల్లో పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అనంతపురం రిలయన్స్ మార్ట్ ఎస్‌ఎం బాలచెన్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు, సర్టిఫికెట్లతో పోటీదారులు

నూతన కమిషనర్‌కు కొంగొత్త సవాళ్లు

- ఐఏఎస్ మార్క్ చూపిస్తారా...?
- ఇంజనీరింగ్‌లో దొంగల లెక్కలు సరిచేస్తారా..?
- పాలకవర్గంతో ఎలా ఉంటారనేది హాట్ టాపిక్

అనంతపురం క్రైం



మేఘ స్వరూప్

కార్పొరేషన్‌లో అవినీతి తాండవిస్తోంది. పాలకవర్గం ఉన్నా సమస్యల పరిష్కారం కంటే నిర్లక్ష్యమే ఎక్కువగా ఉందనే విమర్శలున్నాయి. అధికారులు, నేతల వ్యవహార శైలితో నగరపాలికలో పాలన భ్రష్టు పట్టిందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరపాలికకు కొత్త కమిషనర్‌గా మేఘ స్వరూప్ నియమితులయ్యారు. ఐఏఎస్ అధికారి హోదాలో రానున్న ఆయన నగరంలో ఎలాంటి మార్పులు తీసుకొస్తారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్న కమిషనర్ ఎలా ముందుకెళ్తారో వేచి చూడాల్సిందే.

అవినీతి మరక కడిగేస్తారా...?

అక్కడా ఇక్కడా అనే సందేహం అవసరం లేదు.. కార్పొరేషన్‌లోని ప్రతి విభాగానికి అవినీతి మరక అంటింది. టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి విశ్వరూపం ప్రదర్శిస్తోంది. ఈ సెక్షన్‌లో కదిలే ప్రతి ఫైలు పైసల్తో సహా కదలాల్సిందే. లేదంటే ఒక్క అడుగుకూడా ముందుకు పడదు. సెట్‌బ్యాక్స్, అదనపు అంతస్తులు, సెల్లార్లు, అక్రమ కట్టడాలు ఇలా అన్నింటికీ లక్షల్లోనే వసూలు చేస్తారు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీల నుంచి ఏసీపీ కేడర్ వరకు అందరూ అవినీతి మరక ఉన్నావారే. ఇబ్బడి ముబ్బడిగా ఉన్న అక్రమ కట్టడాలే ఆ విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఇక రెవెన్యూ విభాగంలో ఇంటిపన్ను, ఖాళీస్థలం పన్ను విషయాల్లో బాగానే వసూలు చేస్తారు. కమర్షియల్ భవనాలకైతే ఆ వాత ఎక్కువగానే ఉంటుంది. ఓ ఉన్నతాధికారి అంతా తానై నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక ఇంజనీరింగ్‌లో ఇంజనీర్ల కమిషన్ నుంచి ప్రతి ఫైల్‌కు పైసలు ముట్టాల్సిందే. పట్టణ పేదరిక నిర్మూలన సంఘం(మెప్మా)లోనూ వసూళ్ల రాజ్యం నడుస్తోంది. మరికొన్ని విభాగాల్లో ఆయా సెక్షన్ హెడ్‌లకు ముడుపులు అందుతుంటాయి. కొత్త కమిషనర్ ఈ అవినీతి మరక కడిగేస్తారా..? అనే చర్చ సాగుతోంది.

ఇంజనీరింగ్‌లో దొంగల లెక్కలు సరిచేస్తారా..?

నగరాభివృద్ధికి సంబంధించి అభివృద్ధి పనుల విషయంలో ఇంజనీరింగ్ విభాగం కీలకం. కానీ ఇక్కడ దొంగ బిల్లులకే మోక్షం ఎక్కువ. ప్రభుత్వ పథకాల అమలులోనూ డబ్బు కాజేయాలనే మనస్తత్వం ఉంది. నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాట్ల విషయంలో షామియానా, వాటర్‌బాటిళ్లు, స్నాక్స్ లాంటి వాటికే ఒక్కో కార్యక్రమానికి రూ.90వేల నుంచి రూ.99వేల వరకు ఖర్చయినట్లు చూపి కొన్ని కార్యక్రమాలకే రూ.15లక్షల బిల్లు పెట్టేసుకున్నారు. బైపాస్‌రోడ్డులో బ్రిడ్జి కింద వర్టికల్ గార్డెన్ అంటూ కొన్ని మొక్కలు, సీసీ కెమెరాలకే రూ.72లక్షల వరకు తగలేశారు. మొక్కల విషయంలో ఉత్తి పుణ్యానికే రూ.65లక్షల వరకు టెండరు పిలిచి నిర్ణయించిన వాటి కంటే హైట్ తక్కువున్న మొక్కలను తీసుకొచ్చారు. ఓ ఉన్నతాధికారి ఏకంగా కొన్ని మొక్కలను ముందుగానే తెప్పించి రూ.10లక్షలకు బిల్లు పెట్టించుకునే ప్రయత్నం చేశారు. ఇక నామినేషన్ పేరుతో లక్షలాది రూపాయల బిల్లులు చేసేసుకున్న సందర్భాలున్నాయి. సీ బిల్లుల పేరుతో అత్యవసరం పేరుతో నిధుల దుర్వినియోగం చేసిన వారున్నారు. వీటన్నింటిలోనూ కామన్‌గా ఉన్న పాయింట్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడం. మరి ఈ దొంగల లెక్కలను సరిచేస్తారా...? లేదా అనేది తేలాల్సి ఉంది.

పారిశుధ్యం నుంచి వీధిలైట్ల వరకు అన్నీ సమస్యలే..

నగరంలో అత్యంత కీలకమైనది పారిశుధ్యం. కానీ ఇక్కడ ఆ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వర్షాకాలంలోనే కాదు ఏడాది పొడవునా ఇళ్లల్లో దోమల బెడదకు ఆయుధాలు వాడాల్సిందేనంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు తీయని కాలువలు, ఎక్కడ చూసినా చెత్త దిబ్బలు ఇవీ నిత్యం నగరంలో కనిపించే దృశ్యాలు. ప్రభుత్వం గొప్పగా ఆరంభించిన క్లాప్ కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అయి కూర్చుంది. ఇంటింటి చెత్త సేకరణ జరగడమే లేదు. కొన్ని ప్రాంతాల్లో వారానికో సారి చెత్త కోసం వెళ్తే అదే గొప్ప. ఇక వీధి లైట్లు ఎక్కడ వెలుగుతున్నాయో తెలియని పరిస్థితి. ప్రధాన రోడ్లలో మినహా కాలనీల్లో కనిపించడం లేదు. ఇక గత కొంతకాలంగా తాగు నీటి సరఫరా విషయంలో అలసత్వం నెలకొంది. మోటార్లు తరచూ మరమ్మతులకు గురి కావడం, పైపులైన్లు పగిలిపోవడం కారణంగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్న కమిషనర్ ఎలా ముందుకెళ్తారో వేచి చూడాల్సిందే.



పాలకవర్గంతో ఎలా ఉంటారో..

కొత్తగా వచ్చే కమిషనర్ అందులోనూ ఐఏఎస్ అధికారి పాలకవర్గంతో ఎలా ఉండబోతారనేది హాట్ టాపిక్‌గా మారింది. నగరంలోని 50 డివిజన్లలోనూ 48మంది వైసీపీ కార్పొరేటర్లే గెలుపొందారు. దీంతో మెజార్టీ స్వరం వారిదే. మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు కీలకంగా ఉన్నారు. ఆ ముగ్గురికీ అంతర్గతంగా విభేదాలు ఉన్నప్పటికీ కీలకమైన బిల్లులు, తీర్మానాల విషయంలో వారంతా ఒకేతాటిపైకి వచ్చే అవకాశం లేకపోలేదు. ఇలాంటి సందర్భాల్లో కమిషనర్ తన వైఖరికి అనుకూలంగా వెళ్తారా...? పాలకవర్గ నేతలు చెప్పిన దానికి తలొగ్గుతారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు పాలకవర్గంలో కొందరు భవనాలు, పనులు, ఇతరత్ర విషయాల్లో వచ్చే కమీషన్లు బాగానే పుచ్చుకుంటున్నారు. వారి ఒత్తిళ్ల క్రమంలోనూ అధికారులు, సిబ్బంది అటు మామూళ్లు పుచ్చుకుంటూనే పనులు చేసి పెడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత కమిషనర్ పాలకవర్గంలో ఓ కీలకనేతకు ప్రతికూలంగా, మరో కీలకనేతకు అనుకూలంగా వ్యవహరించారనే అపవాదును మూటగట్టుకున్నారు. గతంలో ఐఏఎస్ హోదా ప్రశాంతి ఐఏఎస్ మార్క్‌ను చూపించారనే చెప్పవచ్చు. కానీ ఆ సమయంలో పాలకవర్గం లేదు. మరి కొత్త కమిషనర్ తన మార్క్‌ను ఏ స్థాయిలో చూపుతారనేది త్వరలోనే తేలనుంది.

సైబర్ నేరగాడి అరెస్ట్



నిందితుడు రిజ్వాన్‌తో పోలీసులు

అనంతపురం క్రైం, జనవరి 13: ప్రముఖుల పేరును వాడుతూ ఫేక్ కాల్‌తో సైబర్ నేరానికి పాల్పడుతున్న నేరగాడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ ఆదేశాలతో రాజస్థాన్ రాష్ట్రానికి వెళ్లి వన్‌టౌన్ పోలీసులు ఆ ప్రాంతానికే చెందిన రిజ్వాన్‌ను శనివారం అరెస్ట్ చేశారు. ఇదే కేసులో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఓ మహిళను అరెస్ట్ చేశారు. రాష్ట్రంలోని ముఖ్యమైన పోలీస్ ఆఫీసర్ల ఫోటోలను ప్రొఫైల్‌గా పెట్టుకుని స్థానికంగా ఉన్న కొందరు పోలీస్ ఆఫీసర్లను అర్జెంట్ పని ఉందని చెప్పి డబ్బు పంపాలని వాట్సాప్‌కు చాటింగ్‌లు వెళ్లాయి. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో కీలక నిందితుడైన రిజ్వాన్‌ను రాజస్థాన్‌లోని డీజ్ జిల్లాలో వన్‌టౌన్ ఏఎస్ఐ రజాక్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌నాయుడు, కానిస్టేబుల్ మహమ్మద్ బృందంగా వెళ్లి అరెస్ట్ చేశారు. మహిళల ఫోటోలు ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకుని వాట్సాప్ చాటింగ్ ద్వారా పరిచయం కావడం, న్యూడ్ వీడియోలు పంపి అవతలి వ్యక్తుల వీడియో ఫోటోలను సేకరించి ఆ ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ డబ్బు డిమాండ్ చేసి మోసాలకు పాల్పడటంలో రిజ్వాన్ ఆరితేరినట్లు విచారణలో వెల్లడైంది.

సంప్రదాయాలను పరిరక్షించుకుందాం

జనసేన రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత



ముగ్గులను పరిశీలిస్తున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 13: మన సంప్రదాయాలు, సంస్కృతులను పరిరక్షించుకుందామని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయ ఆవరణంలో ఆమె సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సూచనల మేరకు కులమతాలకు అతీతంగా ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. నగరంలోని మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీర మహిళలు సుమలత, కళ్యాణి, శైలజ, లక్ష్మి, సరోజమ్మ, శ్రావణి, అనురాధ, అఫీద్, సానియా, గాయత్రి, చంద్రకళ, సురేఖ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

- ఏపీ వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్



మాట్లాడుతున్న కేశవరెడ్డి

అనంతపురం క్లాక్ టవర్, డిసెంబరు 13: ఉపాధి కూలీలు చేసిన పనులకు వెంటనే బకాయి చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీ వ్యవసాయ కార్మికసంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజుతో కలిసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు పోకుండా స్థానికంగానే పనికల్పించాలనే ఉద్దేశ్యంతో పేదలు చేసిన పోరాటాలతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి పనులే జీవనాధారమైన అనేక నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు సక్రమంగా పనులు కల్పించక, వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం జిల్లాను కరవు జిల్లాగా ప్రకటించారని, వెంటనే అదనపు పనిదినాలు కల్పించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న రూ.20కోట్ల బిల్లులు వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి కూలీలను నిర్లక్ష్యం చేస్తే క్షేత్రస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





నార్పల, గార్లదిన్నెలలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

నార్పల, జనవరి 13

మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించమన్నారు. ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, రామాంజినమ్మ, రేణుక, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రమణమ్మ, భారతి, రత్నమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని అంగన్‌వాడీల ప్రాజెక్టు కోశాధికారి లీలావతి పేర్కొన్నారు. గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో మాట్లాడుతూ హామీలు అమలు చేసే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో గార్లదిన్నె, కల్లూరు సెక్టార్ల ఫిర్‌దోజ్ బాను, రాజేశ్వరీ, ప్రమీలరాణి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పండుగ కానుకలూ కనుమరుగు: టీడీపీ



మాట్లాడుతున్న మండల టీడీపీ నాయకులు

ఆత్మకూరు జనవరి 13: వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పండుగల సందర్భంగా ఇచ్చే కానుకలు కనుమరుగయ్యాయని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్న సంకల్పంతో నిత్యావసరాలను, కానుకలను అందించేవారన్నారు. జగన్ హయాంలో పండుగ సందర్భంలో కూడా కనీస సాయం పేదలకు అందడంలేదన్నారు. ఒక్క చాన్స్‌పేరుతో పేద ప్రజలకు అందాల్సిన పథకాలు కూడా అందకుండాపోయాయన్నారు. చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సైకో జగన్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాప్తాడులో భూకబ్జాలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ప్రకాష్‌రెడ్డిని ఇంటికి పంపించి మంచి పరిపాలన అందించే పరిటాల సునీతకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ప్రకాష్‌రెడ్డిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. సమావేశంలో మాజీ కన్వీనర్లు వెంకటనారాయణ, హనుమప్ప, రమేష్, వెంకటేసులు, బొమ్మయ్య, పోతన్న, మహిళా నాయకులు లక్ష్మిదేవి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గార్లదిన్నె, జనవరి 13: మండల పరిధిలోని పెనకచెర్ల డ్యాం సమీపంలో శనివారం సాయంత్రం మద్యం విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు కూడేరు మండలం మరుట్లకు చెందిన సురేష్‌బాబునాయక్ డ్యాం సమీపంలోని కోనేపల్లి దారిలో మద్యం విక్రయిస్తున్నాడు. దీంతో అరెస్టు చేసి అతడి నుంచి 13 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సరుకుల పంపిణీ

అనంతపురం కల్చరల్, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిత్యావసర సరుకులను నిత్యసురభి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ మల్లికార్జునవర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి, సభ్యులు పురుషోత్తమ మురళీకృష్ణ, సౌదామిని, భాగ్యలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

బెదిరింపులు, దౌర్జన్యాలతో కోట్లకు పగడలెత్తారు

- టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం

అనంతపురం విద్య, జనవరి 13: గాలివాటంతో గెలిచిన రాప్తాడు ఎమ్మెల్యే బెదిరింపులు, దౌర్జనాలతో వందల కోట్లకు పడగలెత్తారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాప్తాడులో కంకర క్వారీ యజమానులను బెదిరించడం, దౌర్జన్యంగా గిట్టుబాటు లేని ధరలకు కంకర తోలుకోవడం, కాదంటే దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇసుక, ఎర్రమట్టిని అక్రమంగా తరలించి అడ్డూఅదుపు లేకుండా దోపిడీ చేస్తున్నారనని ఆరోపించారు. గాయిత్రి మిల్ అధినేత, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించడం, అన్నదమ్ముల మధ్య తగాదాలు పెట్టి ఆస్తులు లాగేసుకోవడం చేస్తున్నారన్నారు. తాజాగా కొడిమి జగనన్న లే అవుట్ కాంట్రాక్టర్‌ను బెదిరించడం, కార్మికులను నిర్బంధించడం చూస్తుంటే రాప్తాడులో ప్రజాస్వామ్యం ఉందా అన్న సందేహం కలుగుతుందన్నారు. సాక్షాత్తు పశ్చిమ బెంగాల్ ఎంపీ అనంతపురం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. ఆయన దౌర్జన్యాలను ప్రశ్నించినందుకు తనపై కూడా అక్రమ కేసులు పెట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అరాచకాలను ప్రజలకు చూశారని, వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమాధి కట్టేందుకు రాప్తాడు ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

అనంతపురంరూరల్, జనవరి 13: నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ క్రిష్ణప్రసాద్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. భోగి సందర్భంగా భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, క్లాసికల్ డాన్స్, జబర్దస్తు బృందంచే కామెడీ స్కిట్స్, కొత్త సినిమా పాటలు ఉంటాయన్నారు. 15న క్లాసికల్ డ్యాన్స్, ఇంద్రజాల ప్రదర్శన, జిమ్నాస్టిక్స్ మిమిక్రీ ఉంటాయని పేర్కొన్నారు. 16వ తేదీ క్లాసికల్ డాన్స్, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు, గాలిపటాలు ఎగురవేయడం, ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

శింగనమల, జనవరి 13: మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బేగం మృతి చెందడంతో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు నివాళులు అర్పించారు. నాయకులు బెస్త నారాయణస్వామి, రంగస్వామి, దండు ప్రకాశ్ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

మద్యం తాగి.. తింటూ గొడవపడ్డారు

- ముగ్గురికి రిమాండ్

అనంతపురం క్రైం, జనవరి 13: ముగ్గురూ అన్నదమ్ములు. కలిసే తాగారు. తినడానికి అర్ధరాత్రి సమయంలో ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. అక్కడ ముగ్గురూ గొడవపడ్డారు. ఈ ఘర్షణలో అడ్డుచెప్పబోయిన ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను తోయగా కిందపడిన ఆయనకు గాయాలయ్యాయి. పాత కేసులుండటంతో ఆ ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ గోపాలుడు తెలిపిన మేరకు 5వరోడ్డుకు చెందిన శివకృష్ణ, హరికృష్ణ, చిన్నికృష్ణ సోదరులు. శుక్రవారం రాత్రి కలిసి మద్యం సేవించారు. తినడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. ఆ సందర్భంలో ముగ్గురి మధ్య గొడవ జరిగింది. అది కాస్త రచ్చగా మారింది. ఆ సమయంలో వారి గొడవ ఆపడానికి వచ్చిన త్రీటౌన్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మినారాయణను కిందకు తోశారు. కింద పడిన అతనికి గాయమైంది. పోలీసులు ముగ్గురిని విచారించారు. పాత కేసులుండటంతో శనివారం వారిని రిమాండ్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురి అరెస్ట్

శింగనమల, జనవరి 13: మండలంలోని ఆకులేడు గ్రామంలో శనివారం పేకాట స్థావరంపై ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 17, 040, నాలుగు మోటారు వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరుపరిచారు. పేకాట, కోడి పందేలు ఆడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.





డెప్యుటేషన్ కేరాఫ్ జేఎన్‌టీయూ

- ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగం.. ఇతర విభాగాల్లో ప్రొఫెసర్ల సేవలు
- కుంటు పడుతున్న బోధన
- విద్యార్థి సంఘాల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, జనవరి 13: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల డెప్యుటేషన్‌లకు కేరాఫ్‌గా మారడంతో బోధన కుంటు పడుతోందని ఉద్యోగ, విద్యార్థి వర్గాలనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాలను విస్మరించి పదవుల వ్యామోహంతో బోధన వృత్తికి, విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నాయి. ఏకంగా పదిమంది ప్రొఫెసర్లు కళాశాలను వీడితే పాఠాలు ఎలా పూర్తిచేస్తారన్న ఇంగిత జ్ఞానం ప్రభుత్వానికి లేకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. పాఠాలు బోధించాల్సిన ప్రొఫెసర్‌లు ఇతర పదవులను చేపట్టాలనుకుంటే ప్రొఫెసర్ వృత్తికి రాజీనామా చేసి వెళ్తే అటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం, ఇటు మా పిల్లలకు పూర్తిస్థాయి న్యాయం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇదేంటని ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే.. ఐదు సంవత్సరాలు పనిచేసిన వారు ఒక సంవత్సరం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోకి, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోకి ఎన్ని సంవత్సరాలైనా డెప్యుటేషన్‌మీద వెళ్లేందుకు రూల్స్ ఉన్నాయంటూ సమాధానం చెబుతున్నారు. అయితే విద్యార్థులకు అన్యాయం చేసే రూల్స్ ఏంటని ప్రశ్నిస్తున్నారు.

దక్కని విజ్ఞాన భాగ్యం

ఉద్యోగ జీవితాన్ని ప్రసాదించిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కొంతమంది ప్రొఫెసర్లు పాఠాలు బోధించే భాగ్యాన్ని నోచుకోలేకపోతున్నారు. వారి దశాబ్దాల బోధన అనుభవాన్ని, విజ్ఞానాన్ని విద్యార్థులకు పంచలేకపోతున్నారు. మంచి అనుభవమున్న ప్రొఫెసర్‌ల జ్ఞానాన్ని తమ పిల్లలు పొందలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సాధారణ అధ్యాపకులు ఒక రోజు సమయం బోధించే పాఠాల సారాంశాన్ని అనుభవమున్న ప్రొఫెసర్ ఒక పీరియడ్‌లో అర్థవంతంగా, సులువుగా బోధిస్తారు. వారి అనుభవం తమకు అందని ద్రాక్షగా మారిందని విద్యార్థులు పేర్కొంటున్నారు. పేరుకే వారు యూనివర్సిటీల్లో కొనసాగుతున్నారన్నారు.

ప్రొఫెసర్ల వారీగా పనిచేసిన విభాగాల వివరాలు...

పేరు	బ్రాంచ్	విభాగాలు	సంవత్సరం
రంగజనార్దన	మెకానికల్	ఏపీపీఎస్‌సీ	2017-20
		జేఎన్‌టీయూ వీసీ	2021-
హేమచంద్రారెడ్డి	మెకానికల్	రాష్ట్ర ఉన్నత విద్యామండలి	2019-
దినేష్ శంకర్‌రెడ్డి	కెమికల్	ఎన్ఐటీ, తాడేపల్లిగూడెం	
ఆనందరావు	కంప్యూటర్ సైన్స్	రాయలసీమ యూనివర్సిటీ	2021-23
బాల నరసయ్య	కెమికల్	జేఎన్‌టీయూ హైదరాబాద్	2021-23
చంద్రశేఖర్	ఫిజిక్స్	క్రిష్ణ యూనివర్సిటీ	2021-23
దేవకుమార్	మెకానికల్	టీసీడీఈ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి	2022-
చంద్రమోహన్‌రెడ్డి	ఎలక్ట్రానిక్స్	క్యూఏసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి	2024-
విజయకుమార్	ఎలక్ట్రికల్స్	ఆర్జీయూకేటీ	2023-
జయలక్ష్మి	మ్యాథ్స్	క్రిష్ణ యూనివర్సిటీ	2021-23

వేరేవాళ్లతో పాఠాలు చెప్పిస్తున్నాం

- ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్



విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వేరేవాళ్లతో పాఠాలు చెప్పిస్తున్నాము. ప్రతి బ్రాంచ్‌లోనూ టీచింగ్ అసిస్టెంట్లున్నారు. ప్రొఫెసర్‌లు డిప్యుటేషన్‌పై వెళ్లినప్పుడు టీచింగ్ అసిస్టెంట్లే పాఠాలను పూర్తిచేస్తారు. హేమచంద్రారెడ్డి, దేవకుమార్, చంద్రమోహన్‌రెడ్డి డిప్యుటేషన్‌పై ఉన్నారు. అదేవిధంగా ఆనందరావు, చంద్రశేఖర్ రావు, జయలక్ష్మి, బాల నరసయ్య మూడు సంవత్సరాలపాటు డిప్యుటేషన్‌పై వెళ్లి గత నెలలో తిరిగివచ్చారు. డిప్యుటేషన్ వెళ్లి వచ్చిన రంగజనార్ధన వీసీగా పనిచేస్తున్నారు. ఆర్జీయూకేటీ వీసీ(ఎఫ్ఏసీ)గా విజయకుమార్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్‌గా దుర్గాప్రసాద్ పనిచేస్తున్నారు. తాత్కాలిక ప్రాతిపదిన వెళ్లిన దినేష్ శంకర్‌రెడ్డి ఆర్నెళ్లక్రితం తన ఉద్యోగానికి రాజీనామాచేశారు.

విద్యార్థులకు అన్యాయం

- లక్ష్మీ నరసింహ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు.

పాఠాలు చెపాల్సిన ప్రొఫెసర్లను డిప్యుటేషన్‌పై వివిధ శాఖల్లోకి తీసుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రొఫెసర్లను ఇతర విధుల్లోకి ఎలా పంపుతారు. విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలి అనుభవం, విజ్ఞానం అధికంగా పెంపొందించుకున్న ప్రొఫెసర్‌లు పదవుల కోసం పాకులాడుతున్నారు. వారి పదవుల కాంక్ష కళాశాలపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో కళాశాల పరీక్షల ఫలితాల్లో ఏ ఒక్క సెమిస్టర్ 80శాతం దాటలేదు.






దొంగలకూ.. పండుగే..!

- సంక్రాంతికి వెళ్తున్నారా.. ఇళ్లు భద్రం
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో పోలీసుల నిరంతర నిఘా

ధర్మవరం, జనవరి 13: సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా.. విద్యాసంస్థలకు పది రోజులు, అధికారులకు శనివారం నుంచి నాలుగురోజుల పాటు సెలవులు ఉండటంతో ఇంటిల్లిపాది సొంతూళ్లకు పయనమవుతున్నారు. అయితే తాళం వేసిన ఇళ్లను దోచుకునేందుకు దొంగలు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటియజమానులు జాగ్రత్తలు వహించాలని, లేకపోతే చోరీలు తప్పవని పోలీసులు కొన్ని హెచ్చరిస్తున్నారు.

- ఇళ్లకు తాళాలు వేసుకొని సొంతూళ్లకు వెళ్లే ప్రజలు పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్‌మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలకు అరికట్టవచ్చు.
- స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌నుడౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి. మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది. దీంతో ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో నమోదు పూర్వవుతుంది.



ఎల్‌హెచ్‌ఎం ఎస్ యాప్

ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగం: ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే ప్రజలు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళ్తున్నారు. తిరిగి ఎప్పుడువస్తారు అన్న వివరాలు యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమరాలను అమరుస్తారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోల్ట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. పోలీసులు దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునే అవకాశం ఉంటుంది.

గస్తీ పెంచుతున్నాం : సుబ్రహ్మణ్యం, వన్‌టౌన్ సీఐ, ధర్మవరం



సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకునేందుకు సొంతూళ్లకు వెళ్తున్నప్రజలు కొన్నిజాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉపయోగించుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచవద్దు. బ్యాంకు లాకర్‌లో జాగ్రత్త చేసుకోవడం మంచిది. పండుగలను దృష్టిలో ఉంచుకొని రాత్రిపూట గస్తీ పెంచుతున్నాం.

పశ్చిమ బెంగాల్ కార్మికులు సేఫ్

- ఎంపీ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు
- తహసీల్దార్ ఎదుట హాజరు పరిచిన రూరల్ పోలీసులు



పశ్చిమ బెంగాల్ కార్మికులతో పోలీసులు

అనంతపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'మా వాళ్లను మీ ఎమ్మెల్యే' నిర్బంధించారు శీర్షికన ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి నేతృత్వంలో స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు కార్మికశాఖ అధికారులు ఉదయమే కొడిమి జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ కార్మికులతో నిర్బంధం విషయంపై ఆరా తీశారు. అనంతరం ఇక్కడ కార్మికులను ఎవరూ నిర్బంధించలేదంటూ డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. తమ కూలీలు నిర్బంధంలో ఉన్నారని పశ్చిమబెంగాల్ ఎంపీ ఏహెచ్ ఖాన్‌చౌదరి, జగనన్న ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్ సర్వార్‌జహాన్ ద్వారా కలెక్టర్, ఎస్పీలకు ఫ్యాక్స్, మెయిల్ పంపారు. తమ కార్మికులను కాపాడాలని విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం, అధికార పార్టీ నాయకుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇది జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. నిర్బంధంలో ఉన్న తమ కార్మికుల ఆచూకీ తెలపడంతో పాటు వారిని కాపాడాలంటూ కాంట్రాక్టర్ సర్వార్‌జహాన్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీపీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో పాటు అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను రెస్పాండెంట్స్‌గా చేర్చారు. హైకోర్టులో ఈ పిటీషన్ వేయడంతో పోలీసులు ఈ అంశాన్ని మరింత సీరియస్‌గా తీసుకున్నట్లు అర్థమవుతోంది. ఈక్రమంలోనే నిర్బంధానికి గురయ్యారని చెబుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన 9 మంది కార్మికులను అనంతపురం రూరల్ తహసీల్దార్ ఎదుట శనివారం రాత్రి అనంతపురం రూరల్ పోలీసులు హాజరు పరిచారు. తమను ఎవరూ నిర్బంధించలేదని, నిర్బంధించి పని చేయించుకోవడం లేదని ఆ కార్మికులతో వాంగ్మూలం తీసుకున్నారు. ఇదంతా చూస్తుంటే దీనివెనుక పెద్ద తతంగమే నడిచిందనడంలో సందేహం లేదు.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు జిల్లా వాసి



కటకం కృష్ణవేణి

అనంతపురం కల్చరల్, జనవరి 13 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌లో యోగాసనాలు ప్రదర్శించేందుకు అనంతవాసికి అవకాశం దక్కింది. ఆయుష్మాన్ భారత్, ఆయుష్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో భాగంగా అనంతపురం నగరంలో 2వ రోడ్డులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకురాలుగా వ్యవహరిస్తున్న కటకం కృష్ణవేణికి ఈ అవకాశం దక్కింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాధిక్ ఖాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో కటకం కృష్ణవేణి యోగా ప్రదర్శన ఇవ్వనున్నారు.

బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- ఎస్కేయూలో 30మంది ఉద్యోగుల సస్పెన్షన్ ● సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్రాహ్మణులకే ఉద్యోగాలు ● నేతల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, జనవరి 13: దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలను ప్రభుత్వాలు, పాలకులు విస్మరిస్తున్నారని పలువురు బీసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ/ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామాహాల్‌లో శనివారం 'ఫూలే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం' నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నా యకులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నేతలు మాట్లాడుతూ ఎస్కేయూలో ఏకంగా 30 మంది బీసీ ఉద్యోగులను సస్పెండ్‌చేసి అగ్రవర్ణాలకు అడ్డంగా ఉద్యోగాలు, ప్రమోషన్‌లు కట్టబెట్టారని, సెంట్రల్ యూనివర్సిటీలో బ్రాహ్మణులకే ఉద్యోగాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను బీసీనే అని చెప్పుకునే ప్రధాని అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే క్లాక్‌టవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి మహాత్మా జ్యోతిరావుపూలే పేరు పెడతామన్నారు. బీసీ స్టడిసర్కిల్స్, శుభకార్యక్రమాలు నిర్వహించేందుకు బీసీ భవన్‌ఏర్పాటు చేస్తామన్నారు .అనంతరం విద్యార్థులకు పురస్కారాలందజేసి కులగణన, 15 డిమాండ్లతోకూడిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పాండురంగయ్య, రాష్ట్ర ప్రధాని కార్యదర్శి పుట్టాశ్రీధర్, ఉపాధ్యక్షులు నాగభూషణం, కార్యదర్శి బలరాముడు, గోగుల శ్రీధర్, నాగరాజు, వివిధ సంఘాల నాయకులు పోతుల రాధాకృష్ణ, డాక్టర్ రామచంద్ర, లక్ష్మణ్ణ, లక్ష్మినారాయణ, నరహరి, అక్కులప్ప, ఓబిలేసు, ఉమామహేశ్వర్, బీరప్ప, మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి, జాకీర్ హుస్సేన్, పెద్దన్న, శ్రీనివాసులు, ప్రసాద్, దండు వెంకట్రాముడు, వైసీపీ నాయకులు క్రిష్టప్ప, మీసాల రంగన్న, హరీష్ యాదవ్, బీసీ రమేష్, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు పార్థసారథి

ఇక్కడా రాజకీయమే..

రాజకీయాలకతీతంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకుడు ఓబుళపతి, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న రాజకీయాలను ప్రస్తావించారు. కళ్యాణదుర్గంలో వైసీపీ నుంచి పోటీ చేస్తున్న ఎంపీ తలారి రంగయ్యకు బీసీలు మద్దతివ్వాలని పిలుపునివ్వడం విమర్శలకు దారి తీసింది.

'జన్ భాగీదారి' ఘనంగా నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, జనవరి 13: సామాజిక సమతా సంకల్పంలో భాగంగా జిల్లాలో 'జన్ భాగీదారి' కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. శనివారం ఆమె వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో125అడుగుల డాక్టర్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తున్నారన్నారు. అందులో భాగంగా 19వరకు జిల్లాలో కూడా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 17న అన్నిప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలను శుభ్ర పరచి సుందరంగా ముస్తాబుచేసి పూలమాలలు వేయాలన్నారు. 18నఅన్నిప్రాంతాలలోను మానవహారాలు, రక్తదాన శిబిరాలు, ఫొటో ఎగ్జిబిషన్ , సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని, 19న 125అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణను రెవెన్యూభవన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని అందుకు తగిన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ



క్రీడాకారులతో కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాకటవర్, డిసెంబరు 13: జాతీయ పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు మూడు పతకాలు దక్కాయి. గోవాలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయిపారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు సాకే బాబు బంగారు పతకం, నీలం పల్లవి, సంజయ్‌రెడ్డిలు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన పారా క్రీడాకారులను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, శాప్ కోచ్ మంజుల, కోచ్ సురేష్ శనివారం అభినందించారు.

టీడీపీతోనే ఈడిగల అభ్యున్నతి : కాలవ

అనంతపురం అర్బన్, జనవరి 13 : టీడీపీతోనే ఈడిగల అభ్యున్నతి సాధ్యమవుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో కాలవ శ్రీనివాసులు, టీడీపీ ఈడిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అమర్‌నాథ్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఈడిగ సాధికారసమితి జిల్లా కమిటీని నియమించారు. ఆ సమితి జిల్లా అధ్యక్షుడిగా గొల్లపల్లి నాగరాజుగౌడ్‌ను నియమించారు. అలాగే ఉపాధ్యక్షుడిగా గాది లింగప్ప, పరంధామ, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం. నాగరాజు గౌడ్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అశోక్, సభ్యులుగా రంగస్వామి, శ్రీనివాసులు, సురేష్, నరేష్, ఏకాంతప్ప, తిరుపాల్, ఆదినారాయణలను నియమించారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం సభ్యులు సమన్వయంతో రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.



ఈడిగ సాధికార సమితి జిల్లా నూతన కమిటీతో కాలవ శ్రీనివాసులు

మా కష్టాలు ఇప్పుడు గుర్తొచ్చాయా..?

- ఎంపీ రంగయ్యపై శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు ఫైర్

కళ్యాణదుర్గం, జనవరి 13 : ఎంపీగా పనిచేస్తూ, ఏనాడు శ్రీరామిరెడ్డికార్మికుల కష్టాలు పట్టించుకోలేదని, ఇప్పుడెందుకు వచ్చారంటూ కార్మికులు ఎంపీ తలారి రంగయ్యను ప్రశ్నించారు. నీళ్లు రాకపోతే ఇప్పుడు మేము గుర్తొచ్చామా, జీతాలు ఇస్తేనే సమ్మెను విరమిస్తామని శ్రీరామిరెడ్డి కార్మికులు స్పష్టంగా ఎంపీకి తేల్చిచెప్పారు. శనివారం కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద సమ్మె చేస్తున్న శ్రీరామిరెడ్డి కార్మికుల దగ్గరకు ఎంపీ తలారి రంగయ్య వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో రెండు నెలల జీతాలు మంజూరు చేయిస్తామని, సమ్మెను విరమించాలని కార్మికులను ఆయన కోరారు. అయితే కార్మికులు ఏ మాత్రం ఒప్పుకోలేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ ఖరాఖండిగా ఎంపీ తలారి రంగయ్యకు తేల్చి చెప్పారు. దీంతో ఆయన విన్నంతసేపు విని...అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్మికులతో చర్చలు విఫలం అయ్యాయి. గతంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా ఒకసారి చర్చలు జరిపినప్పటికీ విఫలం అయ్యాయి. మరోసారి ఎంపీతో కూడా చర్చలు విఫలం అయ్యాయి. కార్మికులు కూడా అదరం..బెదరం...అంటూ ఏ మాత్రం మెట్టు దిగకుండా సమ్మెను యథావిధిగా కొనసాగిస్తున్నారు. సంక్రాంతి పండుగకు కూడా పస్తులుండాల్సిందేనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 325 గ్రామాల్లో దాహార్తి కేకలతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. కేవలం ఒక్క నెల జీతాలు మాత్రమే మంజూరు చేశారని కార్మికులు వాపోయారు. మిగిలిన నాలుగు నెలల జీతాలు మంజూరు చేస్తేనే సమ్మెను విరమిస్తామని తెగేసి చెబుతున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో సుమారు 225 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికీ జీతాలు మంజూరు కావాలి. వేతనంతో పాటు, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించాలని వారు కోరుతున్నారు. పూర్తి వేతనాలు మంజూరు చేయాల్సిందేనని తెగేసి చెప్తున్నారు.



ఎంపీతో వాగ్వాదం చేస్తున్న కార్మికులు

రిజర్వాయర్‌కు 355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 13: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 355 క్యూసెక్కులు వస్తున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 355 క్యూసెక్కులు వుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్‌ఫ్లో కింద 540 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటినిల్వ 0.588 టీఎంసీలు వుందని వెల్లడించారు.

సీఎం జగన్‌కూ కేసీఆర్ గతే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, జనవరి 13: తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే మన రాష్ట్రంలో సీఎం జగన్‌కు కూడా పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జోస్యం చెప్పారు. నగరంలోని లలిత కళా పరిషత్‌లో శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రామకృష్ణతోపాటు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ అప్పులు చేసి, ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రాజెక్టులు, కాలువలు, ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధే లేదు. అభివృద్ధి జరగాలంటే జగన్‌ను సాగనంపాల్సిందే నన్నారు. కేంద్రం మత రాజకీయాలు చేస్తోందని, ఎదురు మాట్లాడిన వారిని బ్లాక్ మెయిల్ చేయడమేకాకుండా కేసులు పెట్టి జైళ్లలో పెడుతోందన్నారు. బ్యాంకులు దోచిన బడా బాబులకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. ఈ పదేళ్లలోనే ఏకంగా రూ.156 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ సొమ్మంతా నరేంద్ర మోదీ తన అనుచరులకు దోచి పెట్టారని మండిపడ్డారు. కేంద్రంలో ప్రతిపక్షపాత్ర పోషించాల్సిన కాంగ్రెస్ ఒంటెద్దు పోకడ ప్రదర్శిస్తోందన్నారు. జగదీష్ మాట్లాడుతూ వైసీపీని గద్దె దించితేనే అభివృద్ధి, ఉద్యోగాలు సాధ్యం అవుతాయన్నారు. బీజేపీ విషనాగు అని, ఇన్నాళ్లు వైసీపీ తో పెనవేసుకుని , ఎన్నికల వేళ టీడీపీపై కపట ప్రేమ చూపుతోందన్నా రు. వ్యతిరేక ఓట్లు చీల్చి ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని వైసీపీ చూస్తోందని, ప్రతిపక్షాలన్నీ ఐక్యం కావాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎంవీ రమణ, జిల్లా సహాయకార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గసభ్యులు లింగమయ్య, కేశవరెడ్డి, రవీంద్రనాథ్, జాన్సన్, నారాయణస్వామి, పెద్దయ్య, మల్లికార్జున, సంజీవప్ప, రమణ, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ మంత్రి కాలవ

గుమ్మఘట్ట, జనవరి 13: మండలంలోని గలగల గ్రామంలో మూడురోజుల క్రితం టీడీపీ కార్యకర్త ఉచ్చవగారి వన్నూరుస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం సాయంత్రం ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పరామర్శించారు. కుటుంబ పెద్ద కోల్పోయి కష్టాల్లో ఉన్న పిల్లలను ఎన్‌టీఆర్ ట్రస్టు ద్వారా చదివించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ కుటుంబానికి రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి మనోధైర్యం నింపారు. క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, కేపీదొడ్డి నాగరాజు, దాసరి రాజు, రాజ్‌కుమార్, లోకేష్, బంజోబ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్, జనవరి 13: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పల్లె పిలుస్తోంది... రా... కదలిరా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు ఉడదాల శివ, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సురేష్, సభ్యులు చిన్నంవిజయ్, నేమకల్ పవన్, జెల్లి విజయ్, మదీనాచోటు, గుమ్మనూరు మహేష్, బాషా పాల్గొన్నారు.

ఈడిగ సాధికార సమితి ఉపాధ్యక్షుడిగా పరంధామగౌడ్



కూడేరు, జనవరి 13: టీడీపీ అనంతపురం పార్లమెంటు ఈడిగ సా ధికార కమిటీలో ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలానికి చో టు కల్పించారు. కమిటీ జిల్లా ఉపాధ్యాక్షుడిగా కూడేరు మండలం జయపురం గ్రామానికి చెందిన అంపగౌని పరంధామగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జల్లిపల్లికి చెందిన బుర్ర మధుసుదర్‌గౌడ్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారితో పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాలువ శ్రీనివాసులుచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉపాధ్యక్షుడిగా గాదిలింగప్ప



పామిడి: ఈడిగ సాధికార సమితి పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా తాను ఎన్నికైనట్లు ఈడిగి గాదిలింగప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగరాజుగౌడ్



యాడికి: టీడీపీ ఈడిగ సాధికార సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగరాజుగౌడ్ నియమితులయ్యారు. శనివారం అనంతపురంలో నిర్వహించిన సమావేశంలో నాగరాజుగౌడ్ నియామక పత్రం అందుకున్నారు. యాడికి మండలం రామరాజుపల్లి గ్రామానికి చెందిన నాగరాజు గౌడ్ టీడీపీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

యువతకు మార్గనిర్దేశకుడు స్వామి వివేకానంద


వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

కుందుర్పి, జనవరి 13: యువతకు మార్గనిర్దేశకుడు స్వామి వివేకానంద అని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి అన్నారు. మండల పరిధిలోని విలువలబడిలో శనివారం వివేకానందుని జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తిప్పేస్వామి, డిగ్రీ లెక్చరర్ ఈరణ్ణ, అధ్యాపకుడు చిక్కబొమ్మప్ప, ప్రధానోపాధ్యాయుడు లింగప్ప హాజరయ్యారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివేకానంద యువతకు మార్గనిర్దేశకుడన్నారు. ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వివేకానందుడి అడుగుజాడల్లో పయనిస్తూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. విలువలబడి ఉపాధ్యాయులు, విద్యార్థులు యువత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేద్దాం

కుందుర్పి, జనవరి 13: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో 18వ తేదీన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ధనుంజయ తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలి

గుంతకల్లుటౌన్, జనవరి 13: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిప్రసాద్‌కు శనివారం సీపీఎం నాయకులు విన్నవించారు. పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎక్స్‌రే ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఆసుపత్రి నూతన భవనం ప్రారంభించారు, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కసాపురం రమేష్, వైటీసీ రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ బలాన్ని చూసి సైకో జగన్‌లో వణుకు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా

కళ్యాణదుర్గం, జనవరి 13: టీడీపీ బలం రోజురోజుకు పెరుగుతోందని, ఆ బలాన్ని చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సైకో జగన్‌రెడ్డికి వణుకుపుడుతోందని నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ ఈ రోజు ఎక్కడ చూసినా సైకో జగన్‌రెడ్డిని విమర్శిస్తూ, ఇక ఇంటికి పంపిందామంటూ చర్చించుకుంటున్నారన్నారు. ప్రజలందరూ చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జులు డిష్ మురళి, తలారి సత్యప్ప, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, కౌన్సిలర్లు రాధిక రాజగోపాల్, తిప్పేస్వామి, మండల కన్వీనర్లు పాలబండ్ల శ్రీరాములు, ధనుంజయ, తిప్పేస్వామి, వెంకటేష్, వడ్డె నాగరాజు, సుధాకర్ నాయుడు, బాబు, హరి పాల్గొన్నారు. అనంతరం కుందుర్పి మండలం బెస్తరపల్లిలో అమరవీరుల స్మారకార్థం స్థూపం నిర్మాణానికి ఉమామహేశ్వరనాయుడు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

చెర్లోపల్లిలో..: మండలం చెర్లోపల్లిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఆర్‌జీ శివశంకర్, గోళ్ల వెంకటేశులు, గురుప్రసాద్, రామాంజినేయులు, తిప్పారెడ్డి, రంగప్ప పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం మండలం చెర్లోపల్లిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఉన్నం


పెద్దవడుగూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అస్మిత్ రెడ్డి

పెద్దవడుగూరు: మండలకేంద్రంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, ప్రసాద్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు చిన్నగోవిందు, తిలక్ కుమార్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

గుత్తి: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ అన్నారు. పట్టణంలోని బండగేరిలో శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే టీడీపీని గెలపించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అచారక ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మాజీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, సుధాకర్‌నాయుడు, సుంకన్న, రంగారెడ్డియాదవ్, వెంకటశివుడు, పవన్ పాల్గొన్నారు.


గుత్తిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వెంకటశివుడు యాదవ్


కళ్యాణదుర్గంలో కరపత్రాలు పంచుతున్న ఉమామహేశ్వరనాయుడు


డీ హీరేహాళ్‌లో...

డీ.హీరేహాళ్: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా నియంత పాలన కొనసాగిస్తున్న వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శనివారం మండలంలోని కూడ్లూరు గ్రామంలో నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను వివరించారు. సీఎం ఎన్నికల ముందు ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశాడన్నారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తిప్పన్న, బ్రహ్మానంద రెడ్డి, దేవేంద్ర, ఎల్లప్ప, గవిసిద్ధ, రామాంజి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు పేదలకు వరం


మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, జనవరి 13: ఎన్టీఆర్ ట్రస్టు పేదలకు ఓ వరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. శనివారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్టు కష్టాల్లో ఉన్న పేద విద్యార్థులకు, కుటుంబాలకు విద్య, ఆరోగ్యపరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గత సంవత్సరంలో ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 650 యూనిట్ల రక్తాన్ని సేకరించి ట్రస్టుకు పంపామన్నారు. ఈ సంవత్సరం వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి

తాడిపత్రిటౌన్, జనవరి 13: బీసీవై పార్టీ ఆధ్వర్యంలో పుంగనూరులో శనివారం జరిగిన రైతు ధర్మపోరాట సభలో నాయకులు, కార్యకర్తలపై దాడికి దిగిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త సారథి డాకరాజు యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ సమక్షంలో సభ జరుగుతుండగా హఠాత్తుగా వచ్చిన పోలీసులు సభకు అనుమతి లేదంటూ నాయకులు, కార్యకర్తలతో వాగ్వాదానికి దిగారన్నారు. సభపై ఉన్న పరికరాలను ధ్వంసం చేసి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి చూశారని ఆయన ఆరోపించారు.

గ్రామాల్లో డీఎస్పీ పర్యటన

పెద్దపప్పూరు, జనవరి13: మండలంలోని వరదాయపల్లి, నరసాపురం గ్రామాల్లో శనివారం తాడిపత్రి డీఎస్పీ గంగయ్య పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి గొడవలకు దిగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎంతటివారినైనా ఉపేక్షించమని డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ శరత్‌చంద్ర, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

విడపనకల్లు, జనవరి 13: మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన తిప్పన్న, సిసింద్రా అనే యువకులు విడపనకల్లులో అక్కను చూసేందుకు శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంలో వచ్చారు. తిరిగి రాత్రి నింబగల్లుకు బయలుదేరారు. బస్టాండ్ వద్దకు రాగానే బళ్లారి వైపు వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తిప్పన్న అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సిసింద్రాకు స్వల్ప గాయాలయ్యాయి. గాయ పడిన వీరిని ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిప్పన్నను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

పేకాట, కోడిపందేలు ఆడితే చర్యలు

పుట్లూరు, జనవరి 13: మండలంలోని గాండ్లపాడు శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తనిఖీలకు వెళ్లగా అప్పటికే అక్కడి నుంచి జూదరులు పరారైనట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పేకాట, కోడిపందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యల్లనూరు, జనవరి 13: మండలంలోని చింతకాయమంద గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.2550 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి ఐదుగురిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బొమ్మనహాళ్, జనవరి 13: మండలంలోని గోవిందవాడ గ్రామంలో అదే గ్రామానికి చెందిన వన్నూరుస్వామి అనే వ్యక్తిపై కులం పేరుతో దూషించి దాడి చేయడంతో బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు శనివారం విలేకరులకు తెలిపారు. గోవిందవాడ గ్రామానికి చెందిన వన్నూరుస్వామి అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి కళ్లదేవనహళ్లి గ్రామానికి చెందిన పీ ఆంజనేయులు అనే వ్యక్తి కులం పేరుతో దూషించి దాడి చేశాడని అడ్డు వచ్చిన రాజీవ్ అనే వ్యక్తిపై కూడా రాయితో కొట్టినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్, జనవరి13: పట్టణంలోని ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ తిలక్‌నగర్‌లోని మార్కండేయ స్వామి దేవాలయంలో అనాథ వద్ధురాలు (106) మృతి చెందిందన్నారు. విషయాన్ని టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారన్నారు. దీంతో ఆమెను పాత గుంతకల్లులోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించామన్నారు. రవీంద్ర, రాజశేఖర్, మహేష్, పురుషోత్తం, కృష్ణమూర్తి, సలీం, స్నేహ, అంజి, వేణు, వంశీ, పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

పుట్లూరు, జనవరి 13: మండలంలోని ఎ. కొండాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓబులనాయుడును అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి 11మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి ఓబుల నాయుడును అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

విశ్వ కుమారుడి వ్యవహారశైలి నచ్చకే వైసీపీకి రాజీనామా

● పీఏసీఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్



ఉరవకొండ, జనవరి 13: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు వ్యవహారశైలి నచ్చకే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఉరవకొండ పీఏసీఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గౌరవం లేదన్నారు. పార్టీ క్యాడర్ పట్ల దురుసుగా ప్రణయ్ ప్రవర్తిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో అవినీతి జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీంతో పార్టీకి, పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఆలస్యంగా వృద్ధులకు పింఛన్ పంపిణీ


పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొమ్మనహాళ్, జనవరి 13: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ సచివాలయ పరిధిలో కొందరు వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు 13వ తేదీ అయినా పింఛన్లు రాకపోవడంతో ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు వృద్ధులు పింఛన్లు అందలేదని ఆందోళన చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానెల్‌లో స్క్రోలింగ్ రావడంతో బొమ్మనహాళ్ ఎంపీడీఓ షకీలాబేగం స్పందించి శనివారం సాయంత్రానికి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. బ్యాంకు నుంచి డబ్బు డ్రా చేసి ముగ్గురు వలంటీర్లకు రూ.1.35 లక్షలు ఇవ్వకుండా ఓ పంచాయతీ కార్యదర్శి మొహం చాటేయడంతో వలంటీర్లు డబ్బులు పంపిణీ చేయలేక ఆలస్యం చేసినట్లు తెలిసింది. ఆ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసినప్పటికీ ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో మరొక కార్యదర్శికి ఆయన ఇంటి వద్దకు వెళ్లి విచారించినా అందుబాటులో లేడన్నట్లు తెలిసిందని ఎంపీడీఓ తెలిపారు. ఎట్టకేలకు పంచాయతీ కార్యదర్శి బంధువులతో మాట్లాడి డబ్బులను తెప్పించుకొని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ,జనవరి13: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి ఊరేగింపు


ఊరేగుతున్న శ్రీరంగనాథస్వామి

తాడిపత్రి, జనవరి13: పట్టణంలోని పలు రహదారుల్లో శనివారం రాత్రి రంగనాథస్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోదండరామస్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

తక్కళ్లపల్లిలో భాగవత సప్తాహం


భాగవత పారాయణ చేస్తున్న భక్తులు

పుట్లూరు, జనవరి 13: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భజనమండలి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం భాగవత పఠనం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు సంతోషంగా ఉండాలని స్వామిని వేడుకున్నారు.

16న నందీశ్వరుడికి అభిషేకం

తాడిపత్రి టౌన్, జనవరి 13: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన నందీశ్వరునికి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 16వ తేదీన అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు కూడా ఏర్పాటుచేశామని తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

రాయదుర్గంరూరల్, జనవరి 13: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అప్పలాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ పూజలు చేశారు.

వేములపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

యల్లనూరు, జనవరి13: మండలంలోని వేములపల్లి గ్రామంలో శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సర్పంచు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొని వారి శాఖల గురించి తెలియజేశారు. డాక్టర్ లోకేష్ గ్రామంలో 50మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● బస్సు డ్రైవర్ దుర్మరణం
● 13 మందికి స్వల్ప గాయాలు

కర్నూలు, జనవరి 13: జీన్ జాతీయ రహదారిపై ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంగనపాడు ఫ్లైఓవర్ సమీపంలో ఆగివున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బస్సులో ఉన్న 13 మంది ప్రయాణికులు స్వలంగా గాయపడ్డారు. పోలీసులు వెంటనే వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు... అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళ్తోంది. శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గం డిపో నుంచి బయలుదేరింది. అర్ధరాత్రి సమయంలో ఉలిందకొండ సమీపానికి వచ్చింది. అదే సమయంలో జాతీయ రహదారిపై టైరు పంచర్ కావడంతో కనీస జాగ్రత్తలు కూడా ఆ డ్రైవర్ తీసుకోకుండా లారీని రోడ్డుపైనే నిలిపిఉంచాడు. గుర్తించని ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేగంగా వచ్చి ఆగివున్న లారీని ఢీకొట్టాడు. దీంతో బస్సు నుజ్జునుజ్జయింది. డ్రైవర్ సీటులో ఉన్న ఆంజనేయులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో 13 మందికి స్వల్పగాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ యాడికి మండలం రాయలచెరువు నుంచి హైదరాబాద్‌కు పెయింటింట్ పౌడర్‌ను తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. క్షతగాత్రులకు చికిత్సల నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో ఉన్న రెండో డ్రైవర్ శివన్న ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్ ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.


మృతి చెందిన డ్రైవర్ ఆంజనేయులు


ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

భోగి మంటల్లో నోటీసులు


గుంతకల్లులో సీఎం, బొత్స చిత్రాలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


ఉరవకొండలో హంద్రీనీవా కాలువలో నోటీసులు వేస్తూ...


కూడేరులో భోగి మంట వేసి నిరసన


కణేకల్లులో కబడ్డీ ఆడుతూ...

ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేసి అంగన్‌వాడీలు తమ నిరసనను తెలిపారు. కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. గుంతకల్లులో సీఎం, బొత్స చిత్రాలను దహనం చేశారు. ఉరవకొండలో నోటీసులను హంద్రీనీవా కాలువలో వేశారు. కూడేరులో భోగి మంటల్లో నోటీసులు వేశారు.
- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


యాడికిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


గుత్తిలో నోటీసులను భోగిమంటల్లో వేస్తున్న కార్యకర్తలు


తాడిపత్రిలో...